



చౌడేపల్లె రోడ్డు కల్వర్టు వద్ద వంకలో అక్రమ కట్టడాలు



పుంగనూరు అంబేడ్కర్ సర్కిల్‌లో దుకాణాల్లోకి వచ్చిన వరదనీరు (ఫైల్ ఫొటో)



చౌడేపల్లె రోడ్డులోని వంకలో ఆక్రమణలు

- విచ్చలవిడిగా వంకల దురాక్రమణ.. అక్రమ నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

పుంగనూరుకు పొంచిఉన్న వరద ముప్పు

వరద పారాలంటే వంకలు, కాలువలు ఉండాలి. వీటిని ఆక్రమించేస్తే నీటి ప్రవాహం దిశ మారుతుంది. పరివాహ ప్రాంతాల్లోకి వరద చేరుతుంది. ఇలా ఇప్పటికే మూడుసార్లు పుంగనూరు ప్రజలు వరద ముప్పు ఎదుర్కొన్నారు. మరిప్పుడు.. ఆ ఆక్రమణలు ఇంకా ఎక్కువయ్యాయి. భవిష్యత్తులో వరదొస్తే ముప్పు మరింత తీవ్రంగా ఉండబోతోంది. - పుంగనూరు

రామసముద్రం మండలం ఎగువప్రాంతంలో కురిసే భారీ వర్షాలతో అక్కడి చెరువులు నిండి పుంగనూరుకు వరద నీళ్లు వస్తాయి. పట్టణంలోని రాయలచెరువు, పుంగమ్మచెరువు, సుబ్బమ్మ చెరువుల గుండా వరదనీరు వెళ్లేందుకు గతంలో జమీందారులు విశాలంగా వంకలు తవ్వించారు. రాయలచెరువు నుంచి వరదనీరు దోబీకాలనీ, కొత్తఇండ్లు, మదనపల్లె రోడ్డు వెనుక, శ్రీచైతన్య స్కూల్, చౌడేపల్లె రోడ్డు, చెంగళాపురం మీదుగా 25 అడుగుల వెడల్పు కాలువతో చదళ్ల చెరువులో కలుస్తాయి. అలాగే పుంగమ్మ చెరువు మొరవనీరు పట్టణంలోని తాటిమాకులపాళ్యం, ఇందిరాసర్కిల్, తేపుమరం మీదుగా వెళతాయి. రాజకీయ ప్రాబల్యం వల్ల చెరువులు, వంకలు, కాలువలు ఆక్రమణలకు గురికావడంతో పెద్దవర్షాలు వస్తే ప్రజల్లో వరద భయం కనిపిస్తోంది.



మదనపల్లె రోడ్డులోని రాయలచెరువు వంక ఇలా..

రాయలచెరువు వంక నిండా ఆక్రమణలే

రాయలచెరువు మొరవ నీళ్లు వెళ్లేందుకు దోబీకాలనీ నుంచి కొత్తఇండ్లు, హైస్కూల్, మదనపల్లె రోడ్డు వెనుకవైపు, శ్రీచైతన్య స్కూల్, చౌడేపల్లె రోడ్డులో వంక ఉంది. కొన్నేళ్లుగా వైసీపీ నేతల ప్రమేయంతో ఈ వంకను ఆక్రమిస్తున్నారు. జోరుగా భవనాల నిర్మాణం చేపట్టడంతో వంక కుచించుకుపోతోంది. ఆక్రమణల నుంచి వంకను కాపాడాలంటూ ఇటీవల బీజేపీ నేతలు తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న వాళ్లు లేరు. ఇలా వంక చిక్కి పోవడంతో వరద ఊరు మీదకు రాకుండా ఎక్కడికి పోతుంది?



దోబీకాలనీ వంకలో ఇళ్లు

దోబీకాలనీ వద్ద అదృశ్యమైన వంక

దోబీకాలనీలో పూర్వం నుంచి విశాలమైన వంక కల్వర్టు ఉండేది. కొత్తఇండ్లు నుంచి మినీ బైపాస్‌రోడ్డుకు వెళ్లే దారిలోని వంకను కొన్నేళ్లుగా ఆక్రమిస్తున్నారు. మట్టి తోలి చదును చేస్తున్నారు. ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. ఇళ్లు కడుతున్నారు. ఎప్పుడైనా అధికారులు అడ్డుకుంటే రాజకీయంగా ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ చర్యలతో వంక కాస్త చిన్న కాలువగా మారింది.

కౌండిన్య నదిలోనూ భారీ భవనాల నిర్మాణం

పుంగమ్మచెరువు నుంచి వరద నీరు వెళ్లే కౌండిన్య నది తాటిమాకులపాళ్యం, ఇందిరాసర్కిల్, ఏటిగడ్డపాళ్యం వెళ్లే వంకలో స్థలం విలువ భారీగా పెరిగింది. దీంతో నాయకులు, పలుకుబడి కలిగిన వారు వంకను ఆక్రమించి భారీ భవనాలు, ఇళ్లు కట్టుకున్నారు. కొందరు వంక స్థలాన్ని ఆక్రమించారు. మినీబైపాస్ రోడ్డు నుంచి గోకుల్‌వీధిపై వెళ్లే రాజు కాల్వ ఆక్రమణలతో కనుమరుగైంది. చిత్తూరు- మదనపల్లె మార్గంలోని నూతన బైపాస్‌రోడ్డులో ఉన్న తీగలమ్మచెరువు మొరవను వైసీపీ నాయకులు ఆక్రమించి జే న్యూటౌన్‌లో నుంచి వేళ్లే పెద్ద మొరవను మూసి వరదనీరు వెళ్లేలా పైపులు పెట్టారు.



ఇందిరాసర్కిల్ వద్ద కౌండిన్య నది వంకలో అక్రమ కట్టడాలు

కనువిప్పు కలగదా?

వరదనీరు వెళ్లే వంకలు, నదులు, కాల్వలు ఆక్రమణలకు గురికావడం వల్ల పుంగనూరుకు 1996, 2021, 2022లో వరదలు వచ్చాయి. తాటిమాకులపాళ్యం, బీడీకాలనీ, ఇందిరాసర్కిల్, 50 రాళ్ల మొరవ, చౌడేపల్లె రోడ్డు, ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని మదనపల్లె రోడ్డు బ్రిడ్జిలకు భారీగా నీరు ప్రవహించి ఇళ్లు, దుకాణాల్లోకి వచ్చాయి. పలుమార్గాల్లో రాకపోకలు స్తంభించాయి. పంటలు నీట మునిగాయి. ప్రభుత్వం ఇచ్చిన పరిహారం కన్నా బాధితులు నష్టపోయిందే ఎక్కువ. ఆ తర్వాత కూడా రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపాలిటీ అధికారులు ఆక్రమణలను పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో మళ్లీ భారీ వర్షాలు పడితే మరోసారి వరద ముప్పును ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టాలి. ఇకపై వంకల్లో ఇళ్ల నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వకుండా చూడాలి.

నెట్ మీటర్ల దిశగా రెస్కో!

నెట్ బై డైరెక్షనల్ మీటర్. సింపుల్‌గా చెప్పాలంటే నెట్ మీటర్. అటు వినియోగదారునికి ఇటు విద్యుత్తు సరఫరా సంస్థకు ఉభయతారకంగా ఉండే వీటి కొనుగోలు దిశగా కుప్పం రెస్కో అడుగులు వేస్తోంది. సంప్రదాయ విద్యుత్తు వినియోగాన్ని తగ్గించేలా ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ ప్యానెళ్లను అమర్చాలన్న ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా రెస్కో ఈ నిర్ణయం తీసుకుంది. - కుప్పం



కుప్పంలోని ప్రభుత్వ కార్యాయాల సముదాయ భవనం

- ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్తు పాలసీ నేపథ్యంలో సన్నాహకం
- ఉభయతారక ప్రయోగానికి సిద్ధం

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్తు ఖర్చు తడిసి మోపెడవుతోంది. కుప్పం డివిజన్ పరిధిలోనే వీటికి ఏటా రూ.1.5 కోట్ల బిల్లులవుతున్నాయి. కుప్పం రెస్కోకు ప్రభుత్వం ఈ బిల్లులను సక్రమంగా చెల్లించడం లేదు. ఇప్పటికే రూ.120 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. ఈ చర్యలతో రెస్కో కూడా ఆర్థికంగా నష్టపోతోంది. ఎస్పీడీఎల్ విషయంలోనూ ఇదే జరుగుతోంది. ఈ క్రమంలో కార్యాలయాలకు విద్యుత్తు వ్యయాన్ని తగ్గించుకోవడానికి టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ద్వారా సౌర విద్యుత్తు వాడుకుంటే అధిక బిల్లుల భారంనుంచి బయటపడవచ్చని యోచిస్తోంది. తొలుత సంప్రదాయ విద్యుత్తు వినియోగాన్ని తగ్గించుకుని క్రమేణా పూర్తిగా సోలార్ విద్యుత్తుపైనే ఆధారపడాలన్న యోచనలో ఉంది. ఈ పాలసీ అమల్లోకి వస్తే తొలుత కుప్పం డివిజన్‌ను ప్రయోగాత్మకంగా ఎన్నుకునే అవకాశం ఉంది. ఎందుకంటే తన సొంత నియోజకవర్గమైన కుప్పాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పం. ఈ క్రమంలోనే ప్రభుత్వ కార్యాలయాలలో సోలార్ విద్యుత్తు వినియోగం విషయంలోనూ ఇక్కడ ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి సన్నాహాలు సాగుతున్నాయి. ఆ దిశగా రెస్కో కూడా నెట్ మీటర్ల దిశగా అడుగులేస్తోంది.



నమూనా నెట్ బై డైరెక్షనల్ మీటర్

నెట్ మీటర్లు ఎందుకు?

ఇప్పుడున్న సంప్రదాయ మీటర్లలో విద్యుత్తు సంస్థనుంచి మనకు ఎంత సరఫరా అవుతున్నదన్నది మాత్రమే లెక్క కడుతుంది. విద్యుత్తు సంస్థ నుంచి మాత్రమే దీనికి సరఫరా చేసే వీలుంది. అదే నెట్ బై డైరెక్షనల్ మీటర్ అయితే రెండు విధాలుగా పనిచేస్తోంది. విద్యుత్తు సంస్థనుంచి విద్యుత్తు సరఫరా చేయడమే కాదు.. అవసరమైతే వినియోగదారుడి వద్దనున్న మిగులు కరెంటును సంస్థకు కూడా సరఫరా చేయగలదు. దీన్నే ఇన్‌పోర్ట్, ఎక్స్‌పోర్ట్ అంటారు. అంటే రెండు విధాలుగా పనిచేస్తుంది.

సన్నాహాలు చేస్తున్నాం

ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. కాబట్టి, ఆయా కార్యాయాలకు నెట్ బైడైరెక్షనల్ మీటర్లను ఏర్పాటు చేయడానికి మేము కూడా సన్నాహకాలు చేస్తున్నాం.

- సోమశేఖర్, కుప్పం రెస్కో ఎండీ

వినియోగదారుడి వద్ద మిగులు కరెంటా?

సాధారణ వినియోగదారుడి వద్ద మిగులు విద్యుత్తు ఉండదు. వీరికి సంప్రదాయ మీటరు సరిపోతుంది. అలా కాకుండా ప్రభుత్వ కార్యాలయాల మీద ప్యానెళ్లు ఏర్పాటు చేసి, సోలార్ విద్యుత్తును అమల్లోకి తీసుకొస్తే.. నెట్ మీటర్లు ఉపయోగపడుతాయి. ఎలాగంటే.. ఈ కార్యాలయాలకు సంప్రదాయ విద్యుత్తు సరఫరా కూడా ఉంటుంది. ప్రభుత్వ కార్యాలయాలు పగటి వేళల్లో మాత్రమే పనిచేస్తాయి. రాత్రిళ్లు వినియోగం అతి తక్కువ. పగలైనా, రాత్రైనా సోలార్ విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఈ లెక్కన రాత్రిపూట సోలార్ విద్యుత్తు మిగులుగా ఉంటుంది. ఈ కరెంటును నెట్ మీటరు ద్వారా విద్యుత్తు సంస్థకు (రెస్కోకు) బదలాయిస్తుంది. దీనికి బదులుగా ప్రభుత్వ కార్యాలయాలకు సంప్రదాయ విద్యుత్తుకు సంబంధించి బిల్లు మొత్తాన్ని ఆ సంస్థ తగ్గిస్తుంది. ఒకవిధంగా ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్తు బిల్లులు తగ్గడంతోపాటు రివర్స్‌లో ఈ కార్యాలయాలే రెస్కోకు విద్యుత్తును విక్రయిస్తాయన్న మాట.



వృషభ వాహనంపై ఉత్సవర్ల ఊరేగింపు

వృషభుడిపై మూషిక వాహనుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 12: కాణిపాక వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం చిలుక.. రాత్రి వృషభ వాహనాలపై ఉత్సవర్లు ఊరేగారు. చిలుక వాహన సేవకు కాణిపాకానికి చెందిన ఆర్యవైశ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వృషభ వాహన సేవకు కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లె, ముదిగోళం, చిత్తూరుకు చెందిన శాలివాహన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకురావడంతో ఆలయ కల్యాణ వేదికపై సిద్ధి, బుద్ధి సమేత స్వామివారి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. వృషభ వాహనంపై ఆశీనులను చేసి కాణిపాక పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో గురుప్రసాద్, ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, ఉభయదారులు పాల్గొన్నారు.

ఘనంగా రథ కలశ పూజ : బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించనున్న రథోత్సవానికి గురువారం రథ కలశ పూజ నిర్వహించారు.ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, రథ కలశ అభిషేకం, రథ సారథి పూజ, సంప్రోక్షణ జరిగింది. స్వామివారి గొడుగులను అమర్చి రథ కలశాన్ని గ్రామంలో ఊరేగించారు. రథ శిఖరంపై కలశాన్ని ప్రతిష్ఠించారు. రథోత్సవానికి రథాన్ని సిద్ధం చేశారు.

కాణిపాకంలో నేడు : శుక్రవారం రాత్రి గజ వాహన సేవ జరగనుంది. ఈ కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన వన్నియ నాయకర్ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.





రథ కలశం, గొడుగును తీసుకొచ్చి అమరుస్తున్న రథ చోదకులు

ఎక్సైజ్ శాఖకు సెబ్ సిబ్బంది

- విలీనం చేస్తూ ప్రభుత్వ నిర్ణయం

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 12: వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్ఈబీ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో)ను కూటమి ప్రభుత్వం రద్దుచేసింది. ఎక్సైజ్ శాఖలో విలీనం చేసింది. దీంతో జిల్లాలోని 8 ఎస్ఈబీ స్టేషన్లు, 140 మంది సిబ్బంది వచ్చే నెల నుంచి ఎక్సైజ్ శాఖ పరిధిలోకి రానున్నారు. 2021 మే నెలలో ప్రభుత్వం సెబ్‌ను ఏర్పాటు చేసింది. అప్పటి ఎక్సైజ్ సిబ్బందిలో 70 శాతం సెబ్‌కు, 30 శాతం ప్రొహిబిషన్, ఎక్సైజ్‌కు కేటాయించింది. ఆ ప్రకారం జిల్లాలో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, పలమనేరు, కుప్పం, కార్వేటినగరం, నగరి, పులిచెర్ల, పుంగనూరు మొత్తం 8 సెబ్ స్టేషన్లు ఏర్పాటయ్యాయి. ఎస్ఆర్‌పేట, క్యాటిల్ ఫారం, వి.కోటలో ఎస్ఈబీ చెక్‌పోస్టులున్నాయి. వీటితో పాటు ఇంటెలిజెన్స్, టాస్క్‌ఫోర్స్, బార్డర్ మొబైల్ పార్టీలు పనిచేస్తున్నాయి. ఇందులో 13 మంది ఇన్‌స్పెక్టర్లు, 14 మంది ఎస్ఐలు, మిగిలిన 113 మందిలో హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరంతా ఎక్సైజ్ శాఖ పరిధిలోకి రానున్నారు.

పోలీసు కస్టడీకి రెస్కో మాజీ ఛైర్మన్

కుప్పం, సెప్టెంబరు 12: కుప్పం రెస్కో మాజీ ఛైర్మన్ సెంథిల్ కుమార్‌ను అర్బన్ పోలీసులు తమ కస్టడీకి తీసుకున్నారు. ఛైర్మన్‌గా ఉన్నప్పుడు వాహన నిర్వహణకు సంబంధించి నిధుల దుర్వినియోగం కేసులో ఆయన్ను ఆగస్టు 2న పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కుప్పం కోర్టు 15 రోజుల రిమాండు విధించింది. పోలీసుల అభ్యర్థన మేరకు రెండు రోజుల పోలీసు కస్టడీకి కుప్పం కోర్టు తీర్పునిచ్చింది. దీంతో మదనపల్లె సబ్ జైలులో ఉన్న సెంథిల్ కుమార్‌ను గురువారం అర్బన్ పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. రహస్య ప్రదేశంలో ఉంచి విచారిస్తున్నారు.

19 నుంచి ఆన్‌లైన్‌లో ఆర్బీఐ క్విజ్ పోటీలు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 12: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 90వ వార్షికోత్సవం సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ, ఆర్థిక వ్యవహారాలు, ఆర్‌బీఐ డిజిటల్ కరెన్సీ, ఆర్థిక వ్యవస్థ, క్రీడలు, చరిత్ర, సాహిత్యం, శాస్త్ర, సాంకేతిక, కరెంటు అఫైర్స్ తదితరాలపై క్విజ్ పోటీలు నిర్వహించనుంది. దీనికి 17వ తేదీలోగా ఆర్‌బీఐ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఒక బృందానికి కనీసం ఇద్దరు ఉండాలి. ఈనెల 19 నుంచి 21వ తేదీవరకు, ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్‌లో పోటీలు జరుగుతాయని చిత్తూరు ఎల్డీఎం హరీష్ తెలిపారు.

దేవర సినిమాచూసి చచ్చిపోతా

అమ్మా.. అప్పటిదాకా బతికించండి

తిరుపతిలో బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న యువకుడి వేడుకోలు

● బతికించండంటూ తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు

తిరుపతి(విద్య), సెప్టెంబర్ 12 : "నా బిడ్డకి బ్లడ్ కేన్సర్. జూనియర్ ఎన్టీయార్‌కి వీరాభిమాని. రోజు రోజుకీ పరిస్థితి విషమిస్తోంది. 'అమ్మా దేవర సినిమా చూసి చచ్చిపోతా.. 27వ తేదీ దాకా నన్ను బతికించండి..' అని వేడుకుంటున్నాడు" అంటూ 19 ఏళ్ల కౌశిక్ తల్లి సరస్వతి కన్నీరు మున్నీరవుతూ వెల్లడించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం తమ బిడ్డ పరిస్థితి గురించి మీడియాకు వివరిస్తూ సాయం చేయండంటూ ఆమె వేడుకున్నారు. టీటీడీలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు, సరస్వతి దంపతుల పెద్ద కుమారుడు కౌశిక్ ఇంటర్ చదువుతుండగా అనారోగ్యానికి గురయ్యాడు. బ్లడ్ కేన్సర్ అని నిర్ధారణ కావడంతో 2022 నుంచీ చికిత్స తీసుకుంటున్నాడు.బోన్‌మారో చేయాలని వైద్యులు చెప్పారు. హైదరాబాద్‌లోని బసవతారకం కాన్సర్ ఆసుపత్రి సహా చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్‌ల్లోని ఆసుపత్రులకు తిరిగారు. ప్రస్తుతం బెంగళూరులోని కిడ్వై హాస్పిటల్లో కౌశిక్ చికిత్స పొందుతున్నాడు. బోన్ మారో చికిత్సకు దాదాపు రూ.60 లక్షలకు పైగానే ఖర్చవుతుందని తెలియడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు. రోజు రోజుకూ మరణానికి దగ్గరవుతున్న కొడుకును చూస్తూ వారు దుఃఖిస్తున్నారు. దాతలు ముందుకు వస్తే బిడ్డ బతుకుతాడని ఆశ పడుతున్నారు. వారి వేదన చూసి 'అమ్మా నేను బతకనని నాకు తెలుసు.. నా కోసం బాధపడకండి.. దేవర సినిమా దాకా బతికించండి చాలు.. నా చివరి కోరిక తీర్చండి' అంటూ తమను బిడ్డ సముదాయిస్తున్నాడని చెబుతూ, కౌశిక్‌కి ప్రాణదానం చేయండంటూ ఆ తల్లిదండ్రులు చేతులు జోడిస్తున్నారు. 9490829381 నెంబరుకు ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా గానీ లేదా కె. సరస్వతి, యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 103310100044506, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0801313కు గాని దాతలు తమ సాయాన్ని అందించవచ్చు.సమాచారం కోసం 79956 65169 నెంబరులో కౌశిక్ తల్లిదండ్రులను సంప్రదించవచ్చు.



ఆసుపత్రిలో కౌశిక్



కంటైనర్ కిందపడి నుజ్జునుజ్జయిన కారు

రోడ్డుపై మృతదేహాలు

ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

మరోసారి రక్తమోడిన భాకరాపేట ఘాట్

తిరుమల నుంచి తిరిగివెళ్తూ ప్రాణాలు కోల్పోయిన చిక్‌బళ్ళాపురవాసులు



మృతులు మునివెంకటరెడ్డి, మంజునాథ, రమేష్‌మూర్తి, గాయపడ్డ అల్లావుద్దీన్

చంద్రగిరి, సెప్టెంబరు 12:తిరుపతి-మదనపల్లె రహదారిలోని భాకరాపేట ఘాట్ మరోసారి రక్తమోడింది. తరచూ ప్రమాదాలతో వార్తల్లో వుండే ఈ రోడ్డులో గురువారం జరిగిన అనూహ్య సంఘటనతో కర్ణాటకవాసులు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.పోలీసుల కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం, చిక్‌బళ్ళాపుర సమీపంలోని హరిస్థలకు చెందిన తేజస్ కుమార్(35) తన తండ్రి మునివెంకటరెడ్డి(55), బావమరిది మంజునాథ(38)తో కలిసి కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్ళి గురువారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. గోలచిందెనహళ్ళికి చెందిన రమేష్‌మూర్తి(34) కారు నడుపుతున్నాడు. 2గంటల సమయంలో భాకరాపేట ఘాట్ రోడ్డులో వెళ్తుండగా కలకడ నుంచి చెన్నైకి టమోటాలను తీసుకెళ్తున్న కంటైనర్ మలుపు వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న వీరి కారుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయిపోయింది. సమాచారం అందుకున్న చంద్రగిరి, భాకరాపేట సీఐలు సుబ్బరామిరెడ్డి, ఇమ్రాన్‌బాషా, కళ్యాణి డ్యామ్ వద్ద వున్న పోలీసు శిక్షణ కళాశాల ఎస్ఐలు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు.పొక్లయినర్‌తో కంటైనర్ కింద వున్న కారును బయటకు తీసేందుకు సాధ్యం కాకపోవడంతో తిరుపతి నుంచి ఒక క్రేన్, భాకరాపేట నుంచి మరో క్రేన్ రప్పించారు.ఈలోపు పోలీసులతో పాటు ఆ దారిలో వెళుతున్న వాహనదారులు కంటైనర్‌లో ఉన్న టమోటా బాక్సులను బయటకు తీశారు. మూడు గంటల సమయంలో క్రేన్ సాయంతో కంటైనర్‌ను అతి కష్టంపై పైకి తీసి, కారులోంచి కేకలు వేస్తున్న తేజస్ కుమార్‌ను బయటకు తీశారు.చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.కారులోనే ఇరుక్కుపోయి మృతి చెందిన రమేష్ మూర్తి, మంజునాథ, మునివెంకటరెడ్డి మృత దేహాలను బయటకు తీశారు.ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ నర్సింగప్ప సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.తరచూ ఇదే ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్న ఎస్పీ జాతీయ రహదారి అధికారుల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలను చేపడతామని తెలిపారు. కాగా కంటైనర్ డ్రైవర్ అల్లాహుద్దీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఐదు కిలో మీటర్ల దూరం స్తంభించిన ట్రాఫిక్

భాకరాపేట ఘాట్‌లో ఈ ప్రమాదంతో సుమారు ఐదు కిలో మీటర్ల దూరం వాహన రాకపోకలు స్తంభించి పోయాయి.కంటైనర్ కింద కారులోని మృత దేహాలను బయటకు తీయడానికి సాయంత్రం 4గంటలైంది.తరువాత కంటైనర్‌ను పక్కకు తీసి, వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు.ఆ లోపు తిరుపతి నుంచి మదనపల్లె, పీలేరుకు వెళ్ళే వాహనాలను చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట నుంచి నారావారిపల్లె, కొత్తపేట మీదుగా భాకరాపేటకు పంపించారు.మరికొన్ని వాహనాలను ఎ.రంగంపేట నుంచి ఐతేపల్లె,దామలచెరువు మీదుగా పీలేరుకు పంపించారు.

జగన్‌తో పలువురు నేతల భేటీ

తిరుపతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌ను గురువారం చిత్తూరు,తిరుపతి జిల్లాలకు చెందిన పార్టీ నేతలు పలువురు కలిశారు. మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కళత్తూరు నారాయణస్వామి, ఆర్‌కే రోజా, ఎంపీ మిధున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బియ్యపు మధుసూదనరెడ్డి, వెంకటే గౌడ, డాక్టర్ సునీల్, ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన మోహిత్‌రెడ్డి, అభినయ్, నిషార్ అహ్మద్, రాజేష్, కృపాలక్ష్మి, విజయానందరెడ్డి,నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి,సంజీవయ్య, మేరిగ మురళీధర్ తదితరులు గురువారం తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యాలయంలో జగన్‌తో భేటీ అయ్యారు. నిజానికి ఎన్నికల ఫలితాలతో షాక్‌కు గురైన వైసీపీ నేతలు నైరాశ్యంలో కూరుకుపోయారు.చాలా మంది ఇరుగుపొరుగు రాష్ట్రాలకు వెళ్ళిపోయి వ్యాపార పనుల్లో నిమగ్నమయ్యారు. మరికొందరు స్థానికంగానే వున్నా రాజకీయంగా క్రియాశీలం కాకుండా నిరాసక్తంగా వుంటున్నారు. దీనికి తోడు అధినేత కూడా రాష్ట్రంలో కాకుండా బెంగళూరులో ఎక్కువగా వుంటుండడంతో గత మూడు నెలల కాలంలో పెద్దగా వీరు కలిసింది లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల అరెస్టయి జైలులో వున్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పరామర్శించేందుకు జగన్ రాష్ట్రానికి రావడంతో వీరంతా తాడేపల్లి చేరుకుని జగన్‌ను కలిశారు. కొందరు బుధవారమే వెళ్ళగా మరికొందరు గురువారం వెళ్ళి అందరూ కలసి బృందంగా వెళ్ళి అధినేతతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొంతసేపు ఉమ్మడి జిల్లాలో నెలకొన్న పరిస్థితులను జగన్ ఆరా తీసినట్టు తెలిసింది. నియోజకవర్గాల వారీగా పరిస్థితిని ఆయా నేతలను ప్రశ్నించి తెలుసుకున్నట్టు సమాచారం.



శ్రీశైల ఆలయం నుంచి వరసిద్ధుడికి పట్టు వస్త్రాల సమర్పణ



ఐరాల (కాణిపాకం), సెప్టెంబరు 12: బ్రహ్మోత్సవాలలో భాగంగా వరసిద్ధుడికి శ్రీశైల భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం తరపున గురువారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆ ఆలయ ఈవో పెద్దిరాజు, సిబ్బందితో కలసి కాణిపాకంలోని అతిథి గృహం నుంచి ఆలయానికి సంప్రదాయ బద్ధంగా పట్టువస్త్రాలు తీసుకొచ్చి స్థానిక ఈవో గురుప్రసాద్‌కు అందించారు. అనంతరం వారు స్వామిని దర్శించుకున్నారు. వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, శ్రీశైలం ఆలయ ఏఈవోలు మోహన్,హరిదాస్, కాణిపాక ఆలయ సూపరింటెండెట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, రంగస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో కేంద్ర మాజీ మంత్రి



ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు 12: కాణిపాక వినాయక స్వామిని గురువారం కేంద్ర మాజీ మంత్రి కిల్లికృపారాణి దర్శించుకున్నారు. ఆమెను సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆమెను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

బీరు బాటిల్ తలపై మోదుకుని వ్యక్తి మృతి



కుప్పం, సెప్టెంబరు 12: కుప్పంలో గురువారం రాత్రి మతిస్థిమితం లేని ఓ వ్యక్తి బీరు బాటిల్‌ను తన తలపై తానే మోదుకున్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అర్బన్ సీఐ జీటీ నాయుడు తెలిపారు. అంతకుముందు అతడు పట్టణంలో ఇద్దరు వ్యక్తులపై దాడిచేసి గాయపరిచాడన్నారు. మృతి చెందిన వ్యక్తి గురించి తెలిసినవారు 9440900733 నెంబరుకు ఫోను చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

బోయకొండ అడవిలో జూదం

13 మంది అరెస్టు.. రూ.13.81లక్షల నగదు సీజ్ ● 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం





విలేకరులతో మాట్లాడుతున్న పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ - పట్టుబడ్డ ద్విచక్రవాహనాలు

చౌడేపల్లె, సెప్టెంబరు 12: బోయకొండ అటవీ ప్రాంతంలో జూదం ఆడుతున్న 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను గురువారం పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ విలేకరులకు వెల్లడించారు. మదనపల్లెకు వెళ్లే మార్గంలో బోయకొండ అడవిలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందింది. పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ తన సిబ్బందితో దాడులు చేశారు. పుంగనూరు మండలం, ములబాగిల్, మదనపల్లె, తమిళనాడు రాష్ట్రం రాణిపేట, కురబలకోట, తిరుపతి రూరల్ పుదిపట్ల, పీటీఎం మండలాలకు చెందిన 13 మంది జూదం ఆడుతుండగా అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13,81,050 నగదు, 20 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఏడుగురు పారిపోయారు. పట్టుబడిన వారిలో కురబలకోటకు చెందిన ఒక ఎంపీటీసీ ఉన్నారు. మల్లికార్జున అలియాస్ అర్జున్‌రెడ్డి, బాలాజి నాయక్, అక్కులరెడ్డి, నాగేంద్ర తరచూ పేకాట శిబిరాలు నిర్వహించేవారు. కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులునాయుడు, అల్లాఉద్దీన్, ఎల్లప్ప, రెడ్డెప్ప, వెంకటరమణ, అశోక్, శశిధర్, మధుసూదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వరద బాధితులకు బీసీఎన్ విద్యా సంస్థల విరాళం రూ.5లక్షలు



చెక్కు చూపుతున్న సునీల్ రాజ్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితులకు బీసీఎన్ విద్యా సంస్థల తరపున రూ.5 లక్షలు విరాళంగా ఇచ్చారు. బీసీఎన్ విద్యా సంస్థల యాజమాన్యం రూ.3 లక్షలు, విద్యార్థులు రూ.2 లక్షలు వంతున సాయం చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను సీఎం సహాయ నిధికి పంపనున్నట్లు కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల సీఈవో సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, ఈసీఈ విభాగాధిపతి జీఎన్.కోదండరామయ్య, పీఆర్వో ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నారాయణరాజు (ఫైల్ ఫొటో)

వెదురుకుప్పం, సెప్టెంబరు 12: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కార్వేటినగరం పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. కార్వేటినగరం మండలం గాజులకండ్రిగ గ్రామానికి చెందిన కె.నారాయణ రాజు(52) వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. దీంతోపాటు చెరుకు కొనుగోలు చేసి, బెల్లం తయారీ చేసేవాడు. పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి అప్పులు చేశాడు. వ్యవసాయంలో నష్టం రావడం, బెల్లం వ్యాపారమూ కలిసి రాకపోవడంతో రుణం తిరిగి చెల్లించలేకపోయాడు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో మనస్థాపానికి గురై ఈనెల 9వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని తిరుపతి స్విమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం గురువారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కార్వేటినగరం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీలకు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా కమ్మగుట్టపల్లెవాసి



పూతలపట్టు, సెప్టెంబర్ 12 : ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలకు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా సంద్ర అమరేంద్రకుమార్ నియమితులయ్యారు. పూతలపట్టు మండలంలోని కమ్మగుట్టపల్లెకు చెందిన అమరేంద్ర కుమార్ ప్రస్తుతం కడప జిల్లా ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో సివిల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంటులో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

వరద బాధితులకు 29 టన్నుల కూరగాయలు



వి.కోట నుంచి కూరగాయల తరలింపు

పలమనేరు/వి.కోట సెప్టెంబరు12 : పలమనేరు మార్కెట్ యార్డునుంచి గురువారం రాత్రి మండీ యజమానుల సంఘం ఆధ్వర్యంలో 29 టన్నుల కూరగాయలను విజయవాడ వరద బాధితుల కోసం రెండు లారీల్లో పంపించారు. టమోటాలు, క్యాబేజి, బెండ, పచ్చిమిరప, బీన్సు, గోరుచిక్కుడు, బంగాళదుంపలు, బీట్‌రూట్, మునగకాయలు, సొరకాయలు, వంకాయలు, అల్లం తదితర కూరగాయలను పంపించారు. పలమనేరు మార్కెట్ యార్డు పరిధిలోని పలమనేరు నుంచి 16టన్నులు, వి.కోట నుంచి 13 టన్నుల కూరగాయలను ఇక్కడినుంచే పంపించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ రీజినల్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఏడీఎం పరమేశ్వర, పలమనేరు మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవకుమార్, మండీయజమానుల అధ్యక్షులు మండీసుధా, మండీ యజమానులు రెడ్డెప్పరెడ్డి, శంకర్, నరేష్‌కుమార్, పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులకు వినతుల వెల్లువ

కుప్పం, సెప్టెంబరు 12: కుప్పం పురపాలక సంఘం 7వ వార్డు పరిధిలోని వడ్డిపల్లె, బేవనపల్లె, రాజీవ్ కాలనీలలో వార్డు ముంగిటికి మున్సిపల్ అధికారులు కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు వివిధరకాల సమస్యలపై మున్సిపల్ కమిషర్ వి.శ్రీనివాస రావుకు వినతులు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీలైనంత త్వరలో ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, టీడీపీ ముస్లిం మైనారిటీ సెల్ నాయకుడు జాకీర్, టీడీపీ నాయకులు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న మినీవ్యాన్ : ఒకరికి గాయలు

రామకుప్పం, సెప్టెంబరు 12: మండల సరిహద్దుల్లోని కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో కర్ణాటక గ్రామం రాజుపేటక్రాస్ సమీపంలో రెండు వాహనాలు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు కథనం మేరకు.. పలమనేరుకు చెందిన బషీర్(38) గురువారం సాయంత్రం కుప్పం నుంచి కొబ్బరికాయలతో ఓ మినీవ్యాన్‌లో బయలుదేరాడు. మార్గమధ్యంలో రాజుపేటక్రాస్ సమీపంలో ముందు టైరు పగిలిపోయింది. దీంతో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. టాటాఏస్ వాహనం ముందుభాగం నుజ్జునుజ్జయింది. వాహనం నడుపుతున్న బషీర్ కాలు విరిగింది. బషీర్‌ను స్థానికులు 108 లో కుప్పం ఆసుపత్రికి తరలించారు.

సబ్సిడీపై ఉలవల పంపిణీ

రామకుప్పం, సెప్టెంబరు 12: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని తెలుగురైతు కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, కొంగనపల్లె పంచాయతీ తెలుగుయువత అధ్యక్షుడు విజయ్‌కుమార్‌లు తెలిపారు. గురువారం వారు కొంగనపల్లె రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీపై ఉలవలను పంపిణీ చేశారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్షం వహిస్తే చర్యలు తప్పవు

శాంతిపురం, సెప్టెంబరు 12: పారిశుధ్య పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో కుమార్ హెచ్చ రించారు. గురువారం మండల పరిధిలోని అనెకర పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. మురుగు కాలువలు శుభ్రం చేయాలన్నారు. చంద్రగిరి క్రాస్‌కు డ్రైనేజి వ్యవస్థ కావాలని, పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరారు. ప్రతిపాదనలు పంపామని మంజూరైన వెంటనే పనులు చేపడతామని ఎంపీడీవో గ్రామస్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రవినాయక్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతే ఆయుష్షును పెంచుతుంది

శాంతిపురం, సెప్టెంబరు 12 : పచ్చదనం, పరిశుభ్రతే మనిషి ఆయువును పెంచుతుందని సోగడబల్ల పాఠశాల ప్రధానోపాధ్యా యులు శేఖర్, స్కౌట్ మాస్టర్లు సిద్ధారెడ్డి, ఈశ్వరయ్య అన్నారు. గురువారం రాళ్లబూదుగూరు, సోగడబల్ల ఉన్నత పాఠశాల స్కౌట్ విద్యార్థులు స్వచ్ఛ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శాంతిపురం - కేజీఎఫ్ గ్రామీణ రహదారికి ఇరువైపులా 200 మొక్కలు నాటారు. ఆ మార్గంలోని గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధం, పచ్చదనం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నీతి కథలు మంచిమార్గంలో నడిపిస్తాయి



కథల పుస్తకాలు అందుకొన్న విద్యార్థులతో తులసినాథంనాయుడు

పలమనేరు, సెప్టెంబరు12 : బాల్యంలో నేర్చుకొన్న పద్యాలు, చదువుకొన్న నీతి కథలే సన్మార్గంలో నడిపిస్తాయని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి. తులసినాథం నాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్సీ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు పెద్దబాలశిక్ష, బొమ్మల భారతం, బొమ్మల రామాయణం, బొమ్మల భాగవతం, బొమ్మల పంచతంత్రంకథలు, జ్ఞానదీపాలు, హరికిషన్ కథలు లాంటి పుస్తకాలను ఆయన అందజేశారు. వార్డెన్ మధుసూదన్‌రెడ్డి దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కల్లూరు, సెప్టెంబర్ 12: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. పులిచెర్ల మండలం 106 రామిరెడ్డిగారిపల్లి, చెరువు ముం దరపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం పులిచెర్ల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్స వాలు నిర్వహించారు. పౌష్టికాహార ప్రదర్శన చేపట్టారు. బాలింతలకు, గర్భిణులకు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మీనాకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, బుజ్జమ్మ పాల్గొన్నారు.

హెచ్ఐవీ పట్ల జాగ్రత్తలు పాటించండి

రొంపిచెర్ల,సెప్టెంబరు12 హెఐవీ పట్ల జాగ్రత్తలు పాటించాలని కోర్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజరు సుమలత అన్నారు. గురువారం రొంపిచెర్ల బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో హెఐవీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీక సంబంధాల వల్ల, రక్త మార్పిడి, సూదులు, షేవింగ్ బ్లేడ్స్ వినియోగం వల్ల హెఐవీ ఒకరి నుంచి మరొకరికి వస్తుందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయుడు లోకనాథరెడ్డి, ఆరోగ్యకార్యకర్తలు హసీనా, మేఘన, శైలజ పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

వి.కోట, సెప్టెంబరు 12: వి.కోట మండల పరధిలో రెవిన్యూ అధికారులు భూములకు సంబంధించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ నాయకులు కోరారు. గురువారం తహసీల్దార్ ఎదుట నిరసన తెలియజేశారు. సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని కోరారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. పెద్దబరిణేపల్లె పంచాయతీ జంగంగురువేపల్లె రెవిన్యూ పరిధిలో రియాజ్ భార్య ఆరీఫా, ఫరీద్ భార్య ఫాతీమా బేగం సాగుచేస్తున్న భూమికి పట్ట ఇవ్వాలని, ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయాలని కోరారు. బసీరుద్దీన్‌కు చెందిన 94 సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందిన వెంకటేష్ అనుభవిస్తున్నాడని అతడికి న్యాయం చేయాలని విన్నవించారు. అనంతరం తహసీల్దార్ పార్వతికి వినతిపత్రం అందించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. జిల్లా నాయకులు మునిరత్నం, మణి, పార్థసారధి, సుబ్రమణ్యం, వినోద్, సుబ్బమ్మ ఉన్నారు.

కోలాహలంగా నిమజ్జనం

సోమల, సెప్టెంబరు 12: మండలంలో గురువారం వినాయక నిమజ్జన కార్యక్రమాలు, ఉట్లోత్సవాలు కోలాహలంగా సాగాయి. కందూరు, పెద్దఉప్పరపల్లె, సోమల కొత్తపేటలో స్వామి వారి లడ్డూను కే. రాజేశ్ రూ.11,600కు, వెండి కాయిన్‌ను సీ. గంగాధరం రూ.13,700కు, స్వామివారి వస్త్రాలను కామిశెట్టి వెంకటాచలపతి రూ.5వేలుకు, కలశాన్ని నాగేంద్ర రూ.5వేలుకు వేలం పాటల్లో దక్కించుకున్నారు.

కల్లూరు ఎస్ఐగా వెంకటేశ్వర్లు

కల్లూరు, సెప్టెంబర్ 12: కల్లూరు పోలీసుస్టేషన్ ఎస్ఐగా చిత్తూరు వీఆర్‌లో ఉన్న వెంక టేశ్వర్లును నియమిస్తూ ఎస్పీ మనికంఠ చందోలు ఉత్తర్వులిచ్చారు.

విద్యుత్ చౌర్యం..జరిమానా

సదుం, సెప్టెంబరు 12: సదుంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎస్ఈ శ్రీనివాసులు బాబు ఆధ్వర్యంలో గురువారం ట్రాన్స్‌కో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగించడంపై 14 కేసులు నమోదు చేశారు. రూ.1.50 లక్షల జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో అధికారులు పూర్ణచంద్ర కుమార్, డీఈఈఈ నరేంద్ర, ఖాదర్ మహలి, సిబ్బంది పాల్గొన్నారు.

బాస్ అధ్యక్షుడిగా రూపేష్



ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న రూపేష్ తదితరులు

పలమనేరు, సెప్టెంబరు12 : పలమనేరులో బలిజ అభ్యుదయ సేవాసంఘం నూతన అధ్యక్షుడిగా స్థానిక సరస్వతి హోటల్ యజమాని రూపేష్ ఎంపికయ్యారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని టీడీపీ కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పండ్ల బుట్టను అందజేసి శాలువకప్పి సన్మానించారు. నామినేటెడ్ పోస్టులలో బలిజలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాస్ ప్రతినిధులు అమ్ములు, అరుణ్, కోటీశ్వర్లు, శ్రీధర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి సన్మానం



గుడుపల్లె, సెప్టెంబరు 12: రాష్ట్ర టీడీపీ వన్నెకుల క్షత్రియ సాధికారిక అధ్యక్షులు మునిరాజు పుట్టినరోజు గురువారం సందర్భంగా అయన్ను కూటమి నేతలు ఘనంగా సన్మా నించారు. టీడీపీ కార్యాలయంలో, ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఆయనతో కేక్ కట్ చేయించారు. పూల మాలలు వేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌కు ఎస్టీయూ సత్కారం

కుప్పం, సెప్టెంబరు 12: జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా భవిష్య నిధి సమస్య పరిష్కారం కావడానికి చొరవ తీసుకున్నందుకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఎస్టీయూ కుప్పం మండల అధ్యక్షుడు ధోని శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేవీ.శ్రీనిదేవి, సీనియర్ నాయకుడు సుబ్బరామన్‌లు ధన్యవాదాలు తెలిపారు. కుప్పం మండల సచివాలయంలో జరిగిన ఒక సమావేశంలో వారు ఆయనను కలిసి శాలువతో సత్కరించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

గుడుపల్లె, సెప్టెంబరు 12: మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గురువారం అధికారులు, గ్రీన్ అంబాసిడర్‌లు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరిగాయి. వీధుల్లో పేరుకుపోయిన చెత్త దిబ్బలను ఎక్స్‌కవేటర్‌తో తొల గించారు. తర్వాత బ్లీచింగ్ చల్లారు. ఖాళీగా ఉన్న స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తీయించారు. మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. మురుగు కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా మందులను స్ప్రే చేయించారు. పారిశుధ్య పనులను ఎంపీడీవో తాజ్ మన్సూర్ పర్యవేక్షించారు.

రామకుప్పం: గ్రామాల శుభ్రతకు పంచాయతీ పాలక వర్గాలు, అధికారులు కృషి చేయాలని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, ఎంపీడీఓ ఈశ్వరన్నలు కోరారు. గురువారం రామకుప్పం మండలం బల్ల గ్రామసచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో వారు మాట్లాడారు. పంచాయతీలకు వచ్చిన నిధులను సద్వి నియోగం చేసుకుని ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డీ బాబు, నేతలు జయశంకర్, నాగభూషణం, శంకర్, సుబ్రీ, చంద్ర, శ్రీనివాసులు, ఎర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.1.5 లక్షల విరాళం

పలమనేరు, సెప్టెంబరు12 : స్థానిక సాయి శ్రీచైతన్య జూనియర్ కళాశాల యాజమాన్యం విజయవాడ వరద బాధితుల కోసం రూ. 1.50 లక్షల విరాళాన్ని సేకరించింది. విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి విరాళాన్ని సేకరించింది. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి గురువారం అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయాలని కోరారు. యాజమాన్యం సభ్యులు ఎంవీఆర్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్, కిషోర్ పాల్గొన్నారు.

ఆలకించండి సారూ..!



ఈ చిత్రంలో మీరు చూస్తున్న ఈమె వయసు (85). పేరు జయమ్మ. వయోభారంతో ఇంటికే పరిమితమైంది. పలమనేరు మండలంలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన ఈమె నడవలేదు. భర్త, ఒక కుమారుడు చాలా ఏళ్ల కిందటే చనిపోయారు. మరో కుమారుడు ఉన్నా వేరేచోట కాపురం ఉంటున్నాడు. దీంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. వయోభారంతో చౌకదుకాణాకి వెళ్లి సరుకులు తెచ్చుకోని పరిస్థితి. అధికారులు స్పందించి పింఛన్ వలే సరుకులు కూడా ఇంటికే తెచ్చి ఇచ్చేలా చూడాలని వేడుకుంటోంది. - పలమనేరు

45 రోజుల్లో ఆరోగ్య సర్వే పూర్తి చేయాలి



మేల్ వార్డులో వైద్యులకు సూచనలిస్తున్న కలెక్టర్

కుప్పం, సెప్టెంబరు 12: ప్రత్యేక ఆరోగ్య సర్వేను 45 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల సచివాలయంలో గురువారం కుప్పం డివిజన్ స్థాయి వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహం, లివర్, కిడ్నీ, అంగ వైకల్యం కలిగిన వ్యక్తుల వివరాలు సేకరించాలన్నారు. సచివాలయ స్థాయిలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు కలిసి ఈ సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఈ సర్వే ఆధారంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి పూర్తి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తుందన్నారు. సర్వేకు అవసరమైన పరికరాలు సిబ్బందికి అందజేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఈ సమావేశంలో కడా పీడీ వికాస్ మర్మత్, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతి, డీఐవో డాక్టర్ హనుమంతరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, డీపీఎంవో డాక్టర్ హర్షవర్ధన్, పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ సుమిత్ కుమార్ సందర్శించారు. అక్కడ వైద్యం అందుతున్న తీరు, వైద్యుల సేవలను పరిశీలించారు. మందుల లభ్యత గురించి ఆరా తీశారు. పురుషుల, స్త్రీల వార్డులకు వెళ్లి వైద్య సేవలను తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కలెక్టర్ ఆదేశించారు.

జీవో నెంబర్ 85 రద్దు చేయాలి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న వైద్యులు

కుప్పం, సెప్టెంబరు 12: జీవో నెంబర్ 85ను వెంటనే రద్దు చేయాలని పీహెచ్‌సీ వైద్యులు డిమాండ్ చేశారు. కుప్పం మండల సచివాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో ప్రభావతిని జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులు గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 85 వల్ల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు సర్వీస్ కోటాలో తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుభాష్ రాజ్, డాక్టర్ హరినాథరెడ్డి, డాక్టర్ జశ్వంత్, డాక్టర్ కిశోర్, డాక్టర్ దీప్‌కుమార్, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ పూజిత ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడలో ఏపీపీఎస్సీ డాక్టర్ అసోసియేషన్ పిలుపుమేరకు విజయవాడలో ఈ నెల 15న నిర్వహిస్తున్న కవాతు కార్యక్రమానికి ప్రతిఒక్క మెడికల్ ఆఫీసర్ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

నిమజ్జనంలో ఘర్షణ..టీడీపీ కార్యకర్తలకు గాయాలు





గాయపడ్డ వినయ్, రాజా

కుప్పం, సెప్టెంబరు 12: కుప్పంలో బుధవారం రాత్రి, గురు వారం తెల్లవారు జామున జరిగిన ఘర్షణలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. ఈ ఘటనలో టీడీపీకి చెందిన వినయ్, రాజు అనే కార్యకర్తలు గాయ పడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కుప్పం లోని పాతపేట విజయ లక్ష్మి రోడ్డులో బుధవారం రాత్రి వినాయక నిమజ్జన ఊరేగింపు జరిగింది. ఈ సంద ర్భంగా వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో వైసీపీ కి చెందిన నాగ బాల రాజు తన సోద రులతో కలిసి టీడీపీ కార్య కర్తలపై మా రణా యుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో వినయ్ అనే టీడీపీ కార్యకర్తకు తీవ్ర గాయాలు కాగా అతడిని చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. రాజా అనే మరో కార్యకర్త గాయపడి పీఈఎస్‌లో చికిత్స పొందు తున్నాడు. నాగబాలరాజుతో పాటు అతడి సోదరులపై కేసు నమోదు చేసినట్లు కుప్పం అర్బన్ సీఐ జీటీ.నాయుడు తెలిపారు.

తాగునీటి సమస్యపై మహిళల నిరసన



రామకుప్పం, సెప్టెంబరు 12: మండలంలోని బందార్లపల్లె పంచాయతీ బగళనత్తం ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు కోరారు. గురువారం బందార్లపల్లె గ్రామసచివాలయంలో గ్రామసభ జరిగింది. ఈ విషయం తెలుసుకున్న మహిళలు ఖాళీ బిందెలతో సచివాలయ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్పంచు రాజగోపాల్, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథరెడ్డిలను నిలదీశారు. బోరు నీరు అడిగంటినా, మోటారు తరచూ మరమ్మతులకు గురవుతున్నా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. సమస్య పరిష్కరిస్తామని వారు చెప్పినా మహిళలు శాంతించలేదు. సచివాలయంలోనికి వచ్చి భీష్మించుకు కూర్చున్నారు. సర్పంచు, పంచాయతీ కార్యదర్శి, టీడీపీ నేతలు శ్రీనాథరెడ్డి, మునిరెడ్డి, పెరుమాళ్ తదితరులతో చర్చించారు. తాగునీటి సమస్య పరిష్కారం అయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా నీరందిస్తామని వారు చెప్పడంతో మహిళలు శాంతించారు. ఈ విషయమై సర్పంచు మాట్లాడుతూ త్వరలోనే బోరుకు అధిక సామర్థ్యం ఉన్న మోటారును అమర్చుతామన్నారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన కోటపల్లి

కల్లూరు, సెప్టెంబర్ 12: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లిలో గురువారం రాత్రి అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. కోటపల్లి గ్రామంలో 40 రోజుల క్రితం అయ్యప్ప మాల ధరించిన భక్తులు మండల వ్రతం ఆచరించారు. గురువారం 41రోజుల అంబళం పూజ నిర్వహించిన అనంతరం భక్తులు ఇరుముడి కట్టుకొని శభరిమలై వెళ్లేందుకు పూజలు ప్రారంభించారు. అయ్యప్ప భక్తుల భజనలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు. శుక్రవారం ఉదయం ఇరుముడితో భక్తులు శభరిమలై బయలుదేరనున్నారు.

వక్ఫ్ చట్టం సవరణ బిల్లును రద్దు చేయాలి

పుంగనూరు, సెప్టెంబరు12: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వక్ఫ్ చట్టం సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని ఎస్‌డీపీఐ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఇందిరాసర్కిల్లో రోడ్డుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు భూములను ముస్లిం పెద్దలకు అప్పగించాలని చూడడం సరికాదన్నారు. ముస్లింల హక్కులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీపీఐ నాయకులు ఖాదర్‌బాషా, జబీ, ముబారక్, ఎజాస్, సిద్ధిక్, సద్దాం, యూసఫ్, మహబూబ్ బాషా, హబీప్, సుహెల్, అతిక్‌బాషా పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు

పుంగనూరు, సెప్టెంబరు12: ఉత్తమ సేవలు అందించిన ఆర్టీసీ సిబ్బందికి ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఈ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజిల్ ఆదా చేయడం, ఆదాయాన్ని పెంచిన డ్రైవర్లు జీఎం. బాషా, అన్వర్, కండక్టర్లు శంకరయ్య, పార్వతమ్మలకు నగదు బహుమతి అందజేశారు. ఆర్టీసీ అధికారులు సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



వెంకటలక్ష్మి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు12: భార్య అదృశ్యమైనట్లు భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని మోదుగులపల్లెకు చెందిన శ్రీరాములు భార్య వెంకటలక్ష్మి(60) పది రోజులుగా కనబడలేదు. పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.

వైభవంగా వినాయక నిమజ్జనం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు12: వినాయక చవితి సందర్భంగా నక్కబండలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాన్ని గురువారం అత్యంత వైభవంగా నిమజ్జనానికి తరలించారు. అన్నదానాలు చేశారు. సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు12: మండలంలోని అడవినాథునికుంట మోడల్ పాఠశాల ఆవరణలో మండల స్థాయి అండర్-14, అండర్- 17 క్రీడా పోటీలు నిర్వహించినట్లు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ లోక్‌నాథ్ తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, పరుగుపందెం పోటీలు బాల, బాలికల విభాగంలో వేర్వేరుగా నిర్వహించారు. క్రీడలను పీడీలు అమర, జ్యోతిలక్ష్మి, శారద, సుమతి, మురళీధర్, కిరణ్, నితిశ్, శ్రీనివాసులు, మహబూబ్‌బాషా, సాధిక్, మంజునాథ్ పర్యవేక్షించారు.

సీతారాం ఏచూరికి నివాళి



పుంగనూరు రూరల్, సెప్టెంబరు12: సీపీఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గంగరాజు పేర్కొన్నారు. గురువారం ఏచూరికి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ పార్టీ నాయకుడు మురళి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఈడిగపల్లెలో ఉచిత వైద్య సేవలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు12: మండలంలోని ఈడిగపల్లెలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం తిరుపతి రమాదేవి ఆస్పత్రి వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులను గ్రామస్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, మదనపల్లె సాయిచిత్ర థియేటర్ అధినేత మల్లిఖార్జునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు ఉత్తమ సేవలు

సోమల, సెప్టెంబరు 12: సప్తగిరి గ్రామీణ బ్యాంకులు ఖాతాదారులకు ఉత్తమసేవలు అందిస్తున్నాయని ఆ బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కందూరులో నూతన భవనంలోకి బ్యాంకును మార్చుచేసిన సందర్భంగా ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ప్రభుహరన్, రీజనల్ మేనేజర్ ప్రభారత్నబాయి, బ్రాంచి మేనేజర్ హరిహర ప్రసాద్, ఖాతాదారులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం

వి.కోట, సెప్టెంబరు 12: గర్భిణులు, బాలింతలు సమతుల్యమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో మాధవీలత అన్నారు. గురువారం మండల పరిధిలోని నెర్నపల్లె అంగన్వాడీ కేంద్రంలో మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రాధ, కార్యకర్తలు నాగభూషణ, మంజుల, భారతి పాల్గొన్నారు.

రోడ్డును బాగుచేయాలని ధర్నా

పుంగనూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రోడ్డును బాగుచేయాలని ప్రజలు, విద్యార్థులు గురువారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు.

వరద బాధితులకు విరాళాలు

కుప్పం, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కుప్పంలో విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. కుప్పం లయన్స్ క్లబ్ తరఫున రూ.30 వేలు చెక్కును గురువారం సీఎం సహాయ నిధికి పంపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జోనల్ చైర్మన్ మహేశ్, కుప్పం అధ్యక్షుడు సోమశేఖర్, మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపీపీ చౌడప్ప, డాక్టర్ మంజునాథ్, డాక్టర్ చైతన్య, డాక్టర్ బాలాజీ, శివ తేవర్, ప్రసాద్, శివప్రసాద్, మణి పాల్గొన్నారు. ● కుప్పం చిరు వ్యాపార సంఘం సభ్యులు రూ25 వేలు చెక్కును టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్. మునిరత్నంకు అందించారు. చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్, పెరుమాళ్ స్వామి, సుబ్రమణ్యం, పటేల్ బాబు, మతీన్, సురేశ్, బాబు, బాలు, కృష్ణ, కరీం, ప్రవీణ్, జమీర్, గోపి, వడివేలు, రాజువేల్, గురుస్వామి, మురుగ తదితరులు పాల్గొన్నారు. ● టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి దివాకర్‌ల ఆధ్వర్యంలో సుమారు రూ.50 వేలు విలువ కలిగిన దుస్తులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నంకు అందించారు.







సీఎం సహాయ నిధికి చెక్కు పంపుతున్న కుప్పం లయన్స్ క్లబ్ ప్రతినిధులు ● కుప్పం చిరు వ్యాపారులు ● దుస్తులు అందిస్తున్న రాజశేఖర్ తదితరులు

పేదల ఆరోగ్యమే చంద్రబాబు లక్ష్యం



అద్దాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్, డాక్టర్ సురేష్ కుమార్, పీఎస్ మునిరత్నం

శాంతిపురం, సెప్టెంబర్ 12 : పేదలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని కుప్పం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు అన్నారు. గురువారం శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవ రణలో కంటి అద్దాలు పంపిణీ చేశారు. కలెక్టర్ సు మిత్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కుప్పం నియోజక వర్గంలో 6600 మంది కంటి పరీక్షలు చేయగా 1200 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించామన్నారు. 3400 మందికి కంటి అద్దాలు సరిపోతాయని తెలిపారు. వారిలో ప్రస్తుతానికి 2700 మందికి అద్దాలు వచ్చాయని మిగిలిన వారికి త్వరలో వస్తాయని వివరించారు. అనంతరం అద్దాలు పంపిణీ చేశారు. కాగా గతనెల 24న శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంటి పరీక్షలు చేసుకొన్న వారిలో ఆపరేషన్లు అవసరమని గుర్తించిన వారిలో కొందరిని బెంగళూరు శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో కడా పీడీ వికాస్ మర్మత్ సర్పంచ్ మురళి, మాజీ ఎంపీపీ ఉదయకుమార్ నాయుడు, గుంజార్లపల్లె సర్పంచ్ విజయరామిరెడ్డి, రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇంచార్జీ చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగరాజు, గిరిధర్, డాక్టర్ వెంకటేష్, జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి ప్రభావతి దేవి, ఇతర వైద్యులు హనుమంతరావు, వంశీకృష్ణ, ప్రసాద్, హరినాథ్, ఎంపీడీవో కుమార్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు


కూలడానికి సిద్ధంగా ఉన్న భవనం

పాల సముద్రం, సెప్టెంబరు 12: పాల సముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేసే ఏఎన్ఎంల కోసం 30 సంవత్సరాల క్రితం ప్రభుత్వం నిర్మించిన రెండు భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఏఎన్ఎంలు ఇందులో నివాసముంటూ రోగులకు 24గంటలు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వీటిని నిర్మించారు. కట్టినప్పటి నుంచి వీటి గురించి పట్టించుకోకపోవడంతో భవనాలు దుస్థితికి చేరుకుని పెచ్చులూడి పడుతున్నాయి. పైగా పది సంవత్సరాలుగా సిబ్బంది ఇందులో నివాసం ఉండడం లేదు. దీంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయి విష పురుగులకు నిలయంగా మారాయి. మరమ్మతులు చేయించాలని పలుమార్లు జిల్లా అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని సిబ్బంది చెబుతున్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనుల గుర్తింపు


సభలో మాట్లాడుతున్న ఈవో పీఆర్డీ రమేష్

పాలసముద్రం, సెప్టెంబరు 12: మండలంలోని బాల కృష్ణాపురం, ఎస్.ఆర్.ఆర్. కండ్రిగ, వనదుర్గాపురం పంచాయతీల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఈవో పీఆర్డీ రమేష్ తెలిపారు. సర్పంచులు నర్సింహరాజు, త్యాగరాజ్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



వెదురుకుప్పం, సెప్టెంబరు 12: కార్వేటినగరం శివాలయం వీధిలోని వినాయకస్వామి విగ్రహానికి గురు వారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పోషకాహారంపై అవగాహన



విజయపురం, సెప్టెంబరు 12: పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా గురువారం అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఎల్లసముద్రం అంగన్వాడీ కేంద్రం పరిధిలో ప్రదర్శన నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, హెచ్ఎం వంశీకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్త రమ్య పాల్గొన్నారు.

ఏటీఎంను తెరిపించండి

గుడిపాల, సెప్టెంబరు 12: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని ఎస్బీఐ ఏటీఎంను తెరిపించాలని ప్రజలు కోరుతున్నారు. నెల రోజుల క్రితం ఏటీఎంలో నగదు చోరీకి గురవ్వడంతో మూసివేశారని తెలిపారు. తర్వాత దాని గురించి పట్టించుకోకపోవడంతో నగదు కోసం వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఏటీఎం కోసం నంగమంగళానికి వెళ్లాలంటే ఖర్చులు ఎక్కువవుతున్నాయని చెప్పారు. అధికారులు స్పందించి ఏటీఎంను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

నగరి, సెప్టెంబరు12 : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. గురువారం మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, మహిళా భద్రతపై కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడితే భవిష్యత్తు నాశనమవుతుందని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యాశకు పోతే దుఃఖం మిగులుతుందని సెట్విన్ అధికారి మోహన్‌కుమార్ తెలిపారు. నగరి స్పెషల్ బ్రాంచ్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణానాయక్ మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్ వాడే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



పెనుమూరు, సెప్టెంబరు 12: పెనుమూరు-చిత్తూరు మార్గంలో పూనేపల్లి రేణుకా నగర్ మలుపు వద్ద రోడ్డుకు పెద్ద రంధ్రం పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది మారింది. రెండు నెలలుగా ఉన్న ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా లాభం లేకపోయింది. ఈ క్రమంలో పూనేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నేత మురళీనాయుడు సొంత నిధులతో గుంతను పూడ్చించారు.

వణికిస్తున్న శునకాలు



పెనుమూరు, సెప్టెంబరు 12: పెనుమూరులో శునకాలతో ప్రజలు వణికిపోతున్నారు. పట్టణంలో గుంపులుగా తిరుగుతూ హల్చల్ చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాల, బస్టాండు, చెక్‌పోస్టు, తహసీల్దారు కార్యాలయం, బైపాసు రోడ్డులో ఎక్కువగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల బెడద తగ్గించాలని కోరుతున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ ఉమా

తవణంపల్లె, సెప్టెంబరు 12: సరైన యాజమాన్య పద్ధతులతో వేరుశనగలో అధిక దిగుబడి సాధించవచ్చునని ఏడీఏ ఉమా తెలిపారు. మండలంలోని టి.పుత్తూరులో గురువారం పొలం-బడి కార్యక్రమానికి ఏడీఏ హాజరై మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో వేరుశనగ వాడుతోందన్నారు. రక్షించుకోవడానికి లీటరు నీటికి 20 గ్రాముల యూరియా కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కంచె పంటగా మొక్కజొన్న వేసుకోవడం వలన చీడ పీడలను నివారించవచ్చున్నారు. ఏవో ప్రవీణ్, ఉద్యాన సహాయకులు శ్రీధర్, వ్యవసాయశాఖకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 12: నగరంలోని 75 దొడ్డిపల్లె వినాయక విగ్రహానికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే గురజాల పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. మాజీ మేయర్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ కార్పొరేటర్ వసంతనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చేపలతో ఆరోగ్యం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 12: చేపలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని, వాటిని తినడం వల్ల ఒమేగా 3 విటమిన్ లభిస్తుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. నగరంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా మంజూరైన ఫిష్ రెస్టారెంట్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. నిర్వాహకులు టి.వెంకటేష్‌ను ఆయన అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఫిషరీస్ డీడీ సి.హెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

విద్యార్థుల ప్రతిభకు పీవీకేఎన్ ప్రతీక

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 12: విద్యార్థుల ప్రతిభకు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రతీకగా నిలిచిందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం కళాశాలలో నిర్వహించిన ప్రణాళిక, అభివృద్ధి కమిటీ సమావేశానికి ఎమ్మెల్యే గౌరవ అధ్యక్ష హోదాలో పాల్గొని కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కళాశాలలో చదివిన విద్యార్థుల్లో చాలామంది దేశ, విదేశాల్లో ఉన్నత హోదాల్లో స్థిరపడ్డారన్నారు. కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కమిటీ సెక్రటరీ ఎన్‌పీ రామకృష్ణ, అధ్యక్షురాలు, ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, సభ్యులు గురజాల చెన్న కేశవులు నాయుడు, పార్థసారథి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వం వేగవంతం

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 12: నగరంలో బీజేపీ సభ్యత్వం వేగవంతం చేయాలని యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం ముందు సభ్యత్వ శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వంశీకృష్ణ మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదులో యువత కీలక పాత్ర పోషించి, వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి


విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 12: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం సాయంత్రం బంగారుపాళ్యంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. దుకాణాల ముందు ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయరాదని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

సరుకులు అందలేదని నిరసన



వెదురుకుప్పం, సెప్టెంబరు 12: నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదని కార్వేటినగరం చిన్న దళితవాడ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండీయూ వాహనదారుడిపై విరుచుకుపడ్డారు. లబ్ధిదారులందరికీ సరుకులు ఇవ్వాలని, లేకపోతే వెళ్లిపోవాలని నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే థామస్ చొరవ తీసుకుని ప్రతినెలా సరుకులు సక్రమంగా పంపిణీ చేసేలా చూడాలని కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : టీడీపీ

వెదురుకుప్పం, సెప్టెంబరు 12: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు నగలపాటి నాగేశ్వరరాజు అన్నారు. గురువారం కార్వేటినగరంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలు తప్పా అభివృద్ధి జాడ కనిపించలేదన్నారు. విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తుంటే వైసీపీ నేతలు విమర్శలు చేయడం బాధాకరమన్నారు. పంట నష్టంపైనా కేంద్రానికి నివేదిక ఇచ్చి ఆదుకుంటారని తెలిపారు. డ్రామాలు మానుకోకపోతే వచ్చే ఎన్నికల్లో 11 స్థానాలు కూడా రావని హితవుపలికారు.

చిత్తూరు ఆర్3 సబ్ డివిజన్ డీఈ బాధ్యతల స్వీకరణ



చిత్తూరు రూరల్, సెప్టెంబరు 12: చిత్తూరు ఆర్3 సబ్ డివిజన్ డీఈగా ఆనంద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పద్మనాభపిళ్లై తిరుపతి కార్పొరేట్ కార్యాలయానికి రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో చిత్తూరు ఎస్‌పీఎం కార్యాలయంలో పనిచేస్తున్న ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు.

మౌలిక వసతులు కల్పించాలి


పాఠశాలలో సౌకర్యాలు పరిశీలిస్తున్న ఏపీసీ

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 12: ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి సూచించారు. నగరంలోని గంగాసాగరం ఎంపీయూపీ స్కూల్‌తో పాటు పలు పాఠశాలల్లోని కాంపౌండ్ వాల్ సర్వే, వాటర్ ప్లాంట్ నిర్వహణ, స్మార్ట్ టీవీ, వంటగది, మౌలిక వసతులను గురువారం ఆయన పరిశీలించారు. తరల్ బేస్ లైన్ పరీక్ష నిర్వహణ తీరు, విద్యార్థుల సామర్థ్యం పరిశీలించారు. ఇంజనీరింగ్ డీఈ మధుసూదన్ రావు, సెకండ్ ఎంఈవో మోహన్ ఆయన వెంట ఉన్నారు.

టీడీపీ నేత అన్నదానం



గుడిపాల, సెప్టెంబరు 12: టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు వివాహ వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని అన్నాక్యాంటీన్‌లో గురువారం అన్నదానం చేశారు. టీడీపీ మండల నాయకులు అరుణ్, ఆనంద్ యాదవ్, శంకర్, కిట్టు, షణ్ముగం, బాబు తదితరులు పాల్గొన్నారు.


కాణిపాక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం చిలుక వాహనంపై ఊరేగుతున్న వరసిద్ధుడు - స్వామి వారికి హారతి ఇస్తున్న అర్చకుడు


ఆస్థాన మండపంలో నృత్యం చేస్తున్న కళాకారులు - కళాకారుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

సత్రవాడలో వైభవంగా గంగజాతర


సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, సెప్టెంబరు 12 : నగరి మున్సిపాలిటీ పరిధిలోని కేవీపీఆర్ పేట, సత్రవాడలో గురువారం గంగజాతర వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమ్మవారిని దర్శించుకున్నారు. మండల పరిధిలోని మిట్టపాళెం, చిన్నతాంగేళ్ జాతరలోనూ ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను సన్మానించారు. నియోజకవర్గం సుభిక్షంగా ఉండేలా చూడాలని గంగమ్మను కోరుకున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మండల పరిధిలోని అడవికొత్తూరులో టీడీపీ నాయకుడు నామదేవరెడ్డి, గొల్లకండ్రిగలో సుబ్బయ్య మండడి, నగరి పట్టణ పరిధిలోని పెరుమాళ్ గుడి వీధిలో కుప్పయ్యశెట్టి తల్లి నవనీతమ్మ, బేరివీధిలో మణి ఆచారి మృతదేహాలను సందర్శించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు.

పాఠశాల స్థలం ఆక్రమణ


పాఠశాల స్థలంలో ఇల్లు నిర్మాణం

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 12: మండ లంలోని తయ్యూరు ప్రాథమిక పాఠశాల స్థలం ఆక్రమణకు గురవుతోంది. ఆవరణలో ఇళ్ల నిర్మాణం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. తయ్యూరు గ్రామ పంచాయతీ, చిన్న తయ్యూరు ప్రాథమిక పాఠశాలకు సంబం ధించి సర్వే నంబరు 83-13లో 1.53 సెంట్ల స్థలముంది. అందులో పాఠశాల భవనం, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయి. జాతీయ రహదారి దగ్గరలోనే ఉండడంతో గ్రామానికి చెందిన కొందరు పాఠశాల స్థలాన్ని ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గత ప్రభుత్వంలో పాఠశాల స్థలంలో గ్రామ సచివాలయం, వాటర్‌ట్యాంకు నిర్మాణానికి సబ్ డివిజన్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల స్థలాన్ని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

పూతలపట్టు, సెప్టెంబరు 12: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు పురుషోత్తం డిమాండ్ చేశారు. జీవో 117ను రద్దు చేయాలన్నారు. గురువారం పూతలపట్టు, వావిల్‌తోట, ముత్తిరేవుల, ఎం.బండపల్లి, ఎగువ పాలకూరు ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. చిత్తూరు జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ 78 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్టీయూ పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిషు మీడియాలను నిర్వహించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించి, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీకి సంబంధించి 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ దేవరాజులు రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రన్, మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి గణేష్, జగదీశ్వర పిళ్లై, రఘుపతి పాల్గొన్నారు.

కన్నన్ పాఠశాల అభివృద్ధికి కృషి


విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 12: నగరంలో పేరుగాంచిన బీఎస్ కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. కన్నన్ 97వ జయంతిని పురస్కరించుకుని పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చదువుతో పాటు నైపుణ్యం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. పూర్వ విద్యార్థి శ్రీరాములు రూ.76 వేలతో 12 సైకిళ్లు ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం రూ.20 వేలతో విద్యార్థులకు దుస్తులు, పార్థసారథి భోజన ఏర్పాట్లకు రూ.10 వేలు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ ఆముద, మాజీ మేయర్ కఠారి హేమలత, ప్రిన్సిపాల్ సయ్యద్ మౌలా, డిప్యూటీ మేయర్ రాజేష్, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు నరసింహులు, లోకనాథం, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై నివేదిక ఇవ్వండి


విచారణ జరుపుతున్న డిప్యూటీ కలెక్టర్ భవానీ

బంగారుపాళ్యం, సెప్టెంబరు 12: శ్మశాన స్థలాన్ని కబ్జా చేశారంటూ మంగళవారం చిత్తూరులో జరిగిన గ్రీవెన్స్‌లో మొగిలి గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు మొగిలిలోని సర్వేనెం.61లో ఊరగుట్ట భూములను డిప్యూటీ కలెక్టర్ భవానీ పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. దీనికి సంబంధించి సమగ్ర వివరాలు మూడ్రోజుల్లోపు ఇవ్వాలని సర్వేయర్ లావణ్యను ఆదేశించారు. ఈ స్థలంలో ఎలాంటి పనులూ చేపట్టరాదని ఆమె కబ్జాదారులను హెచ్చరించారు. పెత్తందారుల పట్టాలను రద్దుచేసి, గిరిజనులకు ఆ భూములు కేటాయించాలని సీపీఎం జిల్లా నాయకులు సురేంద్ర, మురళి, గిరిజన సంఘ నాయకురాలు సావిత్రమ్మ కోరారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


జ్ఞానసుందరి (ఫైల్)

బంగారుపాళ్యం, సెప్టెంబరు 12: గుండెపోటుతో ఉపాధి కూలీ మృతిచెందిన ఘటన మండలంలోని తిమ్మోజిపల్లిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గోవిందయ్య భార్య జ్ఞానసుందరి బోయకొండ సమీపంలో ఉపాధి పనులకు వెళ్లి, ఇంటికి తిరిగి వస్తుండగా ఛాతినొప్పి రావడంతో కుప్పకూలింది. తోటి కూలీలు ఆమెను ఇంటికి చేర్చారు. కొద్దిసేపటికే మృతిచెందింది. ఈమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

జైళ్ల శాఖ డీజీపీని కలసిన ఎస్పీ



చిత్తూరు సిటీ, సెప్టెంబరు 12: ఎస్పీ మణికంఠ గురువారం జైళ్ల శాఖ డీజీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా జైలుకు వచ్చిన డీజీపీ కుమార విశ్వజిత్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం సమర్పించారు. డీజీపీ జిల్లా జైలును సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

ముగిసిన గ్రేడ్-2 వీఆర్వోల బదిలీల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 12: కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో గురువారం రెవె న్యూ విభాగానికి సంబంధించి బదిలీల కౌన్సెలింగ్ డీఆర్వో పుల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. బదిలీల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న 107 మంది గ్రేడ్-2 వీఆర్వోలకు ఆప్షన్లు ఇచ్చారు. కలెక్టరేట్ ఏవో కులశేఖర్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలి


ధర్నా చేస్తున్న ఎస్‌డీపీఐ నేతలు, ముస్లింలు

చిత్తూరు, సెప్టెంబరు 12: వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎస్‌డీపీఐ) నేతలు డిమాండ్ చేశారు. బిల్లుకు వ్యతిరేకంగా గురువారం గాంధీ విగ్రహం వద్ద నిరసన, ధర్నా చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యూసుఫ్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి కేంద్రం ఈ చట్టాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తోందన్నారు. రద్దు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు ఆసిఫ్, కార్యదర్శి తౌసిక్, నేతలు కరీం అబ్దుల్, రెహమాన్, నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు : టీడీపీ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 12: విజయవాడ వరదల విషయంలో మాజీ సీఎం జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్ విమర్శించారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వరద బాధితులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటూ ఉంటే జగన్ లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వాన్ని, చంద్రబాబును విమర్శించాలనే ఉద్దేశంతోనే ఆయన మాట్లాడుతున్నారని అన్నారు. బాధితులకు పులిహోరా ప్యాకెట్ కూడా ఇవ్వని జగన్‌కు ప్రభుత్వాన్ని, చంద్రబాబును విమర్శించే హక్కులేదని పేర్కొన్నారు.

రేపు ఓసీ విద్యుత్ ఉద్యోగుల ఎన్నికలు

ఐరాల, సెప్టెంబరు 12: ఓసీ విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర ఎన్నికలను శనివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమౌళి, రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళిరెడ్డి గురువారం తెలిపారు. చిత్తూరు బ్యాన్స్ హోటల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌వర్మ, ఈపీడీసీఎల్, సీపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ ట్రాన్స్‌కో, జెన్‌కో నుంచి భారీగా ఓసీ ఉద్యోగులు హాజరవుతారన్నారు.

రోడ్డుపైనే వారపు సంత

వాహన రాకపోకలకు అంతరాయం
చిరు వ్యాపారులకు తప్పని తిప్పలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 12: కార్వేటినగరంలో ప్రతి గురువారమూ వారపు సంత నిర్వహిస్తారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు వస్తూ ఉంటారు. సంతకు కార్వేటినగరం-పచ్చికాపల్లం రహదారిలో ప్రత్యేక ప్రాంగణం ఉంది. అయితే ప్రాంగణంలో కాకుండా రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. చిరు వ్యాపారులు రోడ్డుపై క్రయ, విక్రయాలు చేయడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై కార్వేటినగరం ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీపతి మాట్లాడుతూ వారపు సంతకు ప్రత్యేక స్థలం కేటాయించామని, అందులోనే జరగాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

